# ధాన్యం అన్‌లోడింగ్‌ను పర్యవేక్షించాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా
- సాథ్'గాం, నగర్ గ్రామాల్లోని రైస్ మిల్లుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- ఆధునిక యంత్రాల వినియోగంపై యాజమాన్యాలకు సూచనలు
- అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**లోకేశ్వరం, అక్షిత న్యూస్:** నిర్మల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు, అన్‌లోడింగ్ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదేశించారు. శనివారం నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని సాథ్'గాం, నగర్ గ్రామాల్లో ఉన్న మిగతా 2లో..




www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

ఆదివారం । 31 । మే । 2026





- పిఎం బ్రదర్స్ ఆసుపత్రి నిర్లక్ష్యం
- ఒకే ఆస్పత్రిపై వరుస వివాదాలు.. ప్రశ్నార్థకంగా మారుతున్న వైద్య సేవలు?
- గతంలో మృతి ఘటన..
- తాజాగా రోగి కాలు కోల్పోవడంతో మళ్లీ చర్చకు కేంద్రబిందువు
- ఉన్నతాధికారుల చర్యలపై ప్రశ్నలు
- సమగ్ర విచారణకు డిమాండ్

# వైద్యుల నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి




**భద్రాద్రి కొత్తగూడెం /అక్షిత బ్యూరో:**

చుంచుపల్లి మండలం విద్యానగర్‌లోని పీఎం బ్రదర్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మరోసారి వివాదాల కేంద్రంగా మారింది. తాజాగా ఓ రోగి చికిత్స అనంతరం కాలును కోల్పోయిన ఘటనపై కుటుంబ సభ్యులు ఆరోపణలు చేయడంతో, గతంలో ఇదే ఆస్పత్రిలో జరిగిన మరో ఘటనను స్థానికులు గుర్తు చేస్తున్నారు. స్థానికుల వాదనల ప్రకారం, గతంలో ఇదే ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన ఓ రోగి అనస్తీషియా ఇచ్చిన అనంతరం ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ ఘటనపై అప్పట్లో కూడా పలు ప్రశ్నలు మిగతా 2లో..




# పకడ్బందీగా అవతరణ వేడుకలు

- రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్:**

జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలపై జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సంవత్సరపు వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో గౌరవ మిగతా 2లో..





# నీతి..నిజాయితీగా సేవలందించాలి

- తెలంగాణ డిజిపి సీవీ ఆనంద్

**వరంగల్, అక్షిత బ్యూరో:** ప్రతి పోలీస్ అధికారి నీతి నిజాయితీ పనిచేయాలని తెలంగాణ డిజిపి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిజిపి రాష్ట్ర పోలీస్ అధికారులతో హైదరాబాద్ నుండి వీడియో సమావేశం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

- ఎన్ని నిధులైనా వెనుకాడం
- బీడు భూములకు మహర్దశ
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్,పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతంలి
- రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ కు శంకుస్థాపన చేసిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీహరి,రాష్ట ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నా రెడ్డి

**మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి:**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు, రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు అన్ని పెండింగ్ ప్రాజెక్టులు వేగవంతం చేసి చరిత్ర లో



నిలిచి పోయే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలో దేవరకద్ర మండలం లో 32.05 కోట్ల రూపాయలతో నిర్మాణం చేయనున్న అజిలాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి మిగతా 2లో..

# వైద్యుల నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి

మొదటి పేజీ తరువాయి..

తలెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆ ఘటనకు సంబంధించిన అధికారిక నివేదికలు, విచారణ ఫలితాలు లేదా బాధ్యత నిర్ధారణపై స్పష్టత లేదని సమాచారం.

ఈ నేపథ్యంలో, సంవత్సరం వ్యవధిలోనే అదే ఆస్పత్రిలో మరో రోగి కాలు కోల్పోయిన ఘటన వెలుగులోకి రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. వరుసగా వెలుగులోకి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆస్పత్రి నిర్వహణ, చికిత్స విధానాలు, పర్యవేక్షణ వ్యవస్థలపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి."గతంలో ఓ ప్రాణం పోయిందని ఆరోపణలు.. ఇప్పుడు మరో రోగి కాలు కోల్పోయాడు. ఇన్ని ఆరోపణలు వచ్చినా సంబంధిత అధికారులు ఎందుకు సమగ్ర విచారణ చేయడం లేదు?" అని స్థానికులు ప్రశ్నిస్తు న్నారు. ఈ ఘటనల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆస్పత్రికి సంబంధించిన గత ఘటనలు, ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన ఆరోపణలు, చికిత్స రికార్డులు, రిఫరల్ విధానం, వైద్య ప్రమాణాల అమలు వంటి అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయమై పాత్రికేయులు సంబంధిత డాక్టర్ ని వివరణ కోరడానికి ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ అందుబాటులో లేదని సంబంధిత ఆసుపత్రి వాళ్ళు చెప్పటం గమనార్హం. ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న ఈ ఆసుపత్రిపై డాక్టర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆసుపత్రిని సీజ్ చేయాలని స్థానిక ప్రజలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

# పకడ్బందీగా అవతరణ వేడుకలు

మొదటి పేజీ తరువాయి..

మంత్రివర్యులచే జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని, ఇందుకుగాను పోలీస్ పరేడ్ గ్రౌండ్ ను సిద్ధం చేయాలని,అలాగే గ్రౌండ్ లో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు . రాష్ట్ర శాసనమండలి చైర్మన్, పార్లమెంట్ సభ్యులు శాసనమండలి సభ్యులు శాసనసభ్యులు మేయర్ ప్రజాప్రతినిధులు ముఖ్యులను రాష్ట్ర అవతరణ వేడుకలకు ఆహ్వానించాలని, అలాగే ప్రతి ఒక్కరికి ఆహ్వాన పత్రికలు వెళ్లేలాచూడాలని ఆర్డిఓను ఆదేశించారు.

శానిటేషన్ తోపాటు, క్లాక్ టవర్, కలెక్టరేట్ వద్ద ముందు రోజు నుండే విద్యుత్ దీపాలతో అలంకరించాలని నల్గొండ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు.

పోలీస్ పరెడ్‌గ్రౌండ్‌ను అవతరణ వేడుకలకు సిద్ధం చేయాల్సిందిగా పోలీస్ అధికారులతో కోరారు. అలాగే అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథితుల సందేశానికి అవసరమైన నోట్స్ అన్ని శాఖలు సమర్పించినందున సందేశాన్ని తయారు చేయాలని సిపిఓ ను ఆదేశించారు.

సీటింగ్ ఏర్పాట్లను గృహ నిర్మాణ శాఖ పీడి చూడాలని, యాంకర్, పాఠశాల విద్యార్థులచే 2 సాంస్కృతిక కార్యక్రమాలు, అలాగే ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ అవార్డుల విధులను జిల్లా విద్యాశాఖ అధికారి చూడాలని, కార్యక్రమానికి వచ్చిన వారందరికీ అవసరమైన టీ, స్నాక్స్ ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల అధికారులను, ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్కో అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అభివృద్ధి తెలిపే శకటాలను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశిస్తూ డిఆర్డిఓ వీటికి ఇంచార్జిగా వ్యవహరించాలని చెప్పారు. అలాగే వివిధ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని, వీటన్నిటిని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సమన్వయం చేయాలని చెప్పారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి

మొదటి పేజీ తరువాయి..



రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ,పాడి అభివృద్ధి,క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీ హరి,రాష్ట ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ అజిలాపురం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని,ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ వలన అజిలా పురం,గద్దె గూడెం, వెంకటాయ పల్లి గ్రామాలకు 1400 ఎకరాల ఆయకట్టుకు కోయిల్ సాగర్ సోర్స్ నుండి సాగు నీరు అందుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంకు ప్రాధాన్యత నిచ్చి ఉమ్మడి పాలమూరు జిల్లాలో పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు కల్వకుర్తి,నెట్టెంపాడు భీమా,తదితర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని తెలిపారు.

పాలమూరు రంగా రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని చెప్పటం అబద్ధం అన్నారు ఒక్క ఎకరా ఆయకట్టుకు నీరు ఇవ్వలేదని అన్నారు.జూన్ 4,5 తేదీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి తో పాటు తాను ఉమ్మడి జిల్లాలో నిర్మాణంలో ఉన్న లైఫ్ ఇరిగేషన్ పనులు, పెండింగ్ పనులు పరిశీలించి అవసరమైన నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ 4 న జూరాల నుండి ప్రారంభించి 4,5 తేదీల్లో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా,నార్లాపూ,ర్,ఉద్దండాపూర్ రిజర్వాయర్ లను సిఎం తాను పర్యటించి భూ సేకరణ, పెండింగ్ పనులకు ఎన్ని వేల కోట్ల నిధులైనా మంజూరు చేసి పూర్తి చేయ నున్నట్లు తెలిపారు.

ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల నిర్మాణం భూ సేకరణకు, ఆర్‌డఆర్, పెండింగ్ బిల్లులు నిధులు విడుదల చేసి ఇరిగేషన్ ప్రాజెక్ట్ పెండింగ్ పనులు, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు వేగవంతం చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలో కొడంగల్ నారాయణ పేట,కల్వకుర్తి,నెట్టెంపాడు,భీమా,కోయిల్ సాగర్,పాల మూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్ పనులు ప్రభుత్వం వచ్చే రెండున్నర సంవత్సరం ల కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు.

స్థానిక శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి కోరిన విధంగా చౌదరి పల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తానని సానుకూలంగా స్పందించారు.

దేవరకద్ర శాసన సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ కోయిల్ సాగర్ కాలువల మరమ్మతులకు 150 కోట్లు మంజూరు చేయాలని,22 వేల ఎకరాలకు అదనంగా సాగు నీరు. అందించ వచ్చని తెలిపారు.రూ.87 కోట్లతో చౌదరిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ కు ప్రతిపాదనలు పంపాం అనుమతులు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఎస్.పి.డి.జానకి,సర్పంచ్ అనంతమ్మ, మాజీ జడ్.పి చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



### కొనుగోలు కేంద్రం సందర్శన

అజిలా పూర్ శివార్ లో ఏర్పాటు చేసిన పిఏ సిఎస్.కొనుగోలు కేంద్రం ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,వాకిటి శ్రీ హరి లు సందర్శించారు.కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు, ఎంఎస్పి చెల్లింపుపై రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ ఎంఎస్ పి రైతుల ఖాతాల్లో జమ అవుతున్నట్లు వారు సంతోషంతో మంత్రులకు వివరించారు.

# ధాన్యం అన్‌లోడింగ్‌ను పర్యవేక్షించాలి

మొదటి పేజీ తరువాయి..

రైస్ మిల్లులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు.సాథ్'గాం గ్రామంలోని శ్రీదుర్గా రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, అక్కడ యంత్రాల సహాయంతో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక యంత్రాల వినియోగం ద్వారా తక్కువ సమయంలో తక్కువ మంది హమాలీలతో అధిక పరిమాణంలో ధాన్యం సంచులను అన్‌లోడ్ చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల యాజమాన్యాలు కూడా ఇటువంటి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తనిఖీల సందర్భంగా మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సంఖ్య, మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటి వరకు అన్‌లోడ్ చేసిన ధాన్యం పరిమాణం, ప్రస్తుతం పనిచేస్తున్న హమాలీల సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. లారీల ద్వారా వచ్చే ధాన్యాన్ని వెంటవెంటనే అన్‌లోడ్ చేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నగర్ గ్రామంలోని రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్, ధాన్యం నిల్వకు అవసరమైన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. తగిన సంఖ్యలో హమాలీలను అందుబాటులో ఉంచి అన్‌లోడింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, లోకేశ్వరం తహసిల్దార్ సూర్యారావు, ఆర్ఐ లలిత, పోలీస్ సిబ్బంది తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# నీతి..నిజాయితీగా సేవలందించాలి

మొదటి పేజీ తరువాయి..

డిజిపి పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కొరకు పోలీస్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులతో, ఉద్యోగ సమయం అధికారులు, సిబ్బంది పాటించాల్సిన తీరు పై డిజిపి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.సమావేశానికి వరంగల్ కమిషనరేట్ కు చెందిన డీసీపీలు, అదనపు, ఏసీపీ, ఇన్స్ స్పెక్టర్లు, ఎస్ఐ వారి, వారి కార్యాలయం నుండి పాల్గొన్నారు.

# బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** బాలికలు, మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ మహిళ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి





శాఖ, పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి ప్రమీల లతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మహిళలు, బాలికల హక్కులపై అనేక చట్టాలు తీసుకువచ్చాయని, సమాజంలో మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మహిళలు, బాలికలు చట్టాలను గౌరవించాలని, బాల్య వివాహాలపై సమాచారం అందితే వెంటనే అధికారులకు తెలియజేయాలని, విద్యార్థులు తాము చదువుకునే పాఠశాలలను దేవాలయాలుగా భావించాలని తెలిపారు. ఈ సందర్భంగా పుల్లాస్ కార్యక్రమంలో భాగంగా సిర్పూర్ యు మండల కేంద్రానికి చెందిన 74 ఏళ్ల వృద్ధురాలు మెస్రం జిజాబాయి ఉల్లాస పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులైన సందర్భంగా కలెక్టర్ సాలువాతో సన్మానించి అభినందించారు. మాక్ పార్లమెంట్ ద్వారా హక్కులు, చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులు, మహిళలు, బాలికలు పాల్గొన్నారు.

## పొగాకు రహిత సమాజ నిర్మాణానికి
# యువత కృషి చేయాలి

### జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ముందస్తు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి,




సీనియర్ సివిల్ జడ్జి కె.రాణి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి పాల్గొని శిక్షణ పొందుతున్న యువతీ, యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ధూమపానం చేసే వారితో పాటు వారి చుట్టుపక్కల ఉన్నవారు కూడా ప్యాసివ్ స్మోకింగ్ వల్ల ప్రమాదానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కోట్పా చట్టం 2003 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం, విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరమని వివరించారు. యువత తమ ఆరోగ్యం, కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ సెంటర్ డైరెక్టర్ డా. యం. రవికుమార్, రిసోర్స్ పర్సన్ లు ఏ. సంతోష్ కుమార్, గజ్జెల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## బావుసాయిపేటలో వరికొయ్యల
# నిప్పుతో పొలాల్లో అగ్నిప్రమాదం

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** కోనరావుపేట మండలం లోని బావుసాయిపేట గ్రామ శివారులో వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో అగ్నిప్రమాదం సంభవించి సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో మంటలు వ్యాపించాయి. పంట కోతల అనంతరం పొలంలో మిగిలిన వరి కొయ్యలను శుభ్రం చేసే క్రమంలో ఎవరో నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి అదుపులోకి రాకుండా పోయాయి. మంటలు వ్యాపిస్తూ గ్రామ శివారులోని నివాస గృహాలకు చేరుకునే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందారు. వెంటనే గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సమాచారం అందించగా, వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నివాసాల్లోకి మంటలు రాకుండా



గ్రామస్తులు వాటర్ ట్యాంకర్ల సాయంతో నీటిని చల్లుతూ మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. అజాగ్రత్తగా వరికొయ్యలకు నిప్పు పెట్టడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, దీనివల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా పక్కనే ఉన్న ఇళ్లకు కూడా ప్రమాదం పొంచి ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రైతులు వరికొయ్యలను కాల్చే పద్ధతికి స్వస్తి పలికి, అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్‌లో సింగిల్ టెండర్లను వెంటనే రద్దు చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో యుఐడిఎఫ్ నిధులతో చేపట్టిన టెండర్లకు సింగిల్ టెండర్లు మాత్రమే దాఖలు అయినందున వెంటనే వాటిని రద్దు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.టెండర్ల ప్రక్రియపై విశ్లేషించేందుకు శనివారం బద్దం ఎల్లారెడ్డి భవన్ లో సిపిఐ నాయకులతో పంజాల శ్రీనివాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు ముందు మంజూరైన 50 కోట్ల రూపాయల పనులకు టెండర్లు నిర్వహించిన వాటికి ఆమో లభించకుండా అడ్డుపడి కాంట్రాక్టర్లు తిరిగి అన్ని డివిజన్లకు ప్రాధాన్యమిస్తూ టెండర్లు నిర్వహిస్తే వాటిలో 87 టెండర్లలో 69 పనులకు సింగిల్ టెండర్ మాత్రమే దాఖలు కావడం చూస్తుంటే మున్సిపల్ కార్పొరేషన్ లో అవినీతి అక్రమాలు జరిగే అవకాశం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.నగరంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను మంజూరు చేసిందని, పెద్ద మొత్తంలో పనులకు కేవలం ఒక బిడ్ రావడం పలు అనుమానాలకు తావిస్తోందని,టెండర్ ప్రక్రియలో పోటీ లేకపోవడం వల్ల ప్రభుత్వానికి నష్టం జరిగే అవకాశం ఉందని,ప్రజా ధనం దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉందని, పెద్ద,పెద్ద పనులకు పలువురు కాంట్రాక్టర్లు పోటీపడే అవకాశం ఉన్నా ఈసారి సింగిల్ టెండర్ మాత్రమే వేయడం వెనుక ఆంతర్యమేంటో అర్థంకావడం లేదని,నగర ప్రజలకు పలు అనుమానాలు కలుగుతున్నాయని,బిడ్ ప్రక్రియ పారదర్శకత అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలన్నారు. నగర పాలక సంస్థలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీనీ,ఆ పాలక వర్గాన్ని మచ్చిక చేసుకోవడంలో కాంట్రాక్టర్లు ముందుంటారని, బల్దియాలో ఎలాంటి టెండర్ల ప్రక్రియ జరిగినా కాంట్రాక్టర్ల పెత్తనం కనబడుతుందని, ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా ఉన్నప్పటికీ అవినీతి రాజ్యమేలుతుందని, అధికారులకు మున్సిపల్ పై పట్టు లేకపోవడం సిగ్గుచేటని, వెంటనే మున్సిపల్‌లో దాఖలైన సింగిల్ టెండర్లను రద్దు చేయాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని పంజాల శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, టేకు మల్ల సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

# జూన్ 1న సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి

### - డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 1న ముఖ్యమంత్రి జిల్లాలో పర్యటించనున్నారని, పర్యటనలో భాగంగా ముందుగా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీల కోసం ప్రభుత్వం నిర్మించిన 28 ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. ఈ సభా వేదికపై నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత మంజూరును ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని సుగుణక్క వెల్లడించారు. పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం చారిత్రాత్మకమైందని పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు సభకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే వేదికగా ఈ సభ నిలుస్తుందన్నారు.

సభ ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, జిల్లా ప్రజలు,



కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆత్రం సుగుణక్క కోరారు.

ఈ సమావేశంలో నియోజకవర్గం ఇంచార్జి శ్యామ్ నాయక్, గ్రంథాలయ చైర్మన్ కామ్ దే అనిల్ కుమార్,ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, డీసీసీ ఉపాధ్యక్షులు భీమ్ రావ్, తరఖ్, ప్రధాన కార్యదర్శి గాడెవేణి మల్లేష్,సెక్రటరీ నాంపల్లి శంకర్,డైరెక్టర్ జక్కన్న,ఆసిఫాబాద్ టౌన్ ప్రెసిడెంట్ రఫిక్, వాంకిడి ఉప సర్పంచ్ ముండే దీపక్,డీసీసీ మెంబర్ ఆత్రం భీమ్ రావ్, రాపర్తి మురళి,మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, సర్పంచ్ రాథోడ్ సురేష్,మాజీ ఆత్మ చైర్మన్ కృష్ణమూర్తి, వార్డు సభ్యుడు జావీద్,యూత్ కాంగ్రెస్ ఎలగల సాయి, కమలనాథ్ రెడ్డి ,మాజీ సర్పంచ్ పెద్దింటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుజాయిత్ ఖాన్,చునర్కర్ వాసుదేవ్, వేల్పుల సురేష్, చాపిడి సురేష్, ఆత్రం తిరుపతి, రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# బీసీలు చైతన్యం అయితేనే రాజ్యాధికారం

### రాజ్యాధికార దిశగా ముందుకు వెళ్లేందుకే విస్తృతమైన బీసీ పొలిటికల్ జేఏసీ కమిటీలు

### బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలో ఎండబెట్ల మరియు తాడూరు మండలంలో బీసీ పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు దన్నోజు అరవింద్ చారి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శ్రీవిద్య గౌడ్ సీతారాల కలిసి శనివారం రోజున బిసి పొలిటికల్ జేఏసీ కమిటీని ఎన్నుకోవడం జరిగింది.

నాగర్ కర్నూల్ టౌన్ ప్రెసిడెంట్ గొడుగు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సి, దశరథం, మహిళా కార్యదర్శి గొడుగు, శివమ్మ, టౌన్ యూత్ ప్రెసిడెంట్ మహేష్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, టౌన్ యూత్ ప్రెసిడెంట్ రాములు నాగర్ కర్నూల్ కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. తాడూరు మండల అధ్యక్షులుగా యార రమేష్ చిన్న, ఉపాధ్యక్షులు భరత్ కుమార్, సలహాదారులుగా తిరుపతయ్య, బుచ్చయ్య, సోషల్ మీడియా శివ, తాడూరు మండలం మహిళ అధ్యక్షురాలుగా అనిత, వర్కింగ్ ప్రెసిడెంట్ వై, మల్లేష్, యూత్ ప్రెసిడెంట్ జి, కురుమయ్య, మహిళ జనరల్ సెక్రెటరీగా ఎం, హర్షిత ను తాడూర్ కమిటీ లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బిసి పొలిటికల్ జేఏసీ నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ



బీసీలకు స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు దాటుతున్నప్పటికీ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు బీసీలకు ఏ రైతు ఉన్నవో రిజర్వేషన్లు కానివ్వండి విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో మనకు రావాల్సిన వాటా మనకు రాకపోవడం మనము రాజకీయంగా లేకపోవడం వల్లనే ఈ రాజ్యాన్ని కొన్ని సామాజిక వర్గాలు మాత్రమే పరిపాలిస్తున్నారు కాబట్టి మనము అన్ని రంగాల్లో వెనుకబాటు తనంగానే మిగిలిపోయాము అన్నారు. అందుకే బీసీ పొలిటికల్ జేఏసీ విస్తృత స్థాయి కమిటీలు వేసి గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బీసీలు ఏకతాటి పైకి వచ్చి పోరాడవలసిన సందర్భం ఉన్నది. అదేవిధంగా ఓటు చైతన్యం చేస్తూ మన ఓట్లు మనమే వేసుకుని చట్టసభల్లోకి వెళ్ళే విధంగా కృషి చేయాలని కమిటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

### గృహ ప్రవేశ ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన..

### జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లాలోని కెరమెరి మండలం కొఠారి కొత్తగూడ గ్రామానికి జూన్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు విచ్చేస్తున్న సందర్భంగా శనివారం జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్,







డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలిం చడంతో పాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహప్రవేశాలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లను చక్కగా అలంకరించాలని, గ్రామస్తులతో సహ పంక్తి భోజనంతో పాటు లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమం ఉన్నందున సమావేశ వేదిక వద్ద పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారిక లకు సూచించారు. హెలిప్యాడ్ నుండి గ్రామంలో వచ్చే దారిలో స్వాగత తోరణాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులకు ఘనంగా స్వాగతం పలికేలా అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా వర్తించదు

### ఎస్సీ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నేతలు

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ఎస్సీ కులాల నుండి క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా వర్తించదనీ, అదే విధంగా అట్రాసిటీ చట్టం వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ ఎస్సీ హక్కుల పోరాట సంఘం స్వాగతిస్తుందని ఎస్సీ పోరాట సంఘము రాష్ట్ర అధ్యక్షులు మారేడు మోహన్, రాష్ట్ర నేతలుడాక్టర్ వంశ తిలక్ ,దొంతు మల్ల రాంబాబు లక్ష్మి నారాయణ ,లక్ష్మణ్ ,కన్నం శంకర్ అన్నారు.

ఎస్సీ హక్కుల పోరాట సంఘం రౌండ్ టేబుల్ సమావేశం శనివారం కరీంనగర్ లో సభాధ్యక్షులు దావు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఆర్టికల్ 341, 1950 రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను అమలు చేస్తూ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీ కులాల వారికి తక్షణమే ఎస్సీ రిజర్వేషన్ సర్టిఫికెట్ ను రద్దుచేసి వారందరినీ బీసీసీ రిజర్వేషన్ కు చెందిన వారిగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఎస్సీ కులాల నుండి క్రైస్తవ మతంలోకి మారినప్పటికీ కూడా ఎస్సి రిజర్వేషన్ ను రద్దు చేసుకోకుండా బీసీసీగా నమోదు చేసుకోకుండా అక్రమంగా కావాలని ఉద్దేశపూర్వకంగా ఎస్సీ రిజర్వేషన్ పొందుతున్న వారందరిపై తక్షణమే వారి ఎస్సీ హోదా రద్దుచేసి అట్రాసిటీ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా ఆయా రాష్ట్రాల్లో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గత కొన్ని ఏళ్ల నుండి దళిత క్రైస్తవ పేరుతో కొన్ని సంఘాలు ఏర్పడడం అదేవిధంగా దళిత క్రైస్తవుల పేరుతో సమావేశాలు పెట్టబడుతున్నాయన్నారుఇలాంటి సమావేశాలకు సంఘాలకు పూనుకుంటున్న వారందరిపై ఆయా సమావేశాలకు హాజరవుతున్న వారందరిపై చట్టప్రకారం విచారణ జరిపి అందులో ఎవరైతే ఎస్సీ లుగా చలామణి అక్రమంగా అవుతున్నారో వారి యొక్క ఎస్సీ హోదా కూడా రద్దుచేసి వారందరిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ కులాల నుండి క్రైస్తవ మతంలోకి మారిన ప్పటికీ అలాంటి వారికి ఎస్సీ హోదా రద్దు చేయబడి బీసీసీ గా గుర్తించ బడతారని, రాజ్యాంగం స్పష్టంగా చెప్పినప్పటికీ క్రైస్తవ మతంలోకి మారిన ఎస్సీలను గుర్తించే విధానం అత్యంత లోపభూయిష్టంగా ఉండడం చేత మరోవైపు 1976 రాజ్యాంగం 42 వ సవరణ లో చేర్చబడిన సెక్యులర్ అనే పదం వల్ల కూడా ఈ మతం మారిన వారిని గుర్తించడం కష్టతరంగా మారింది. గుర్తించాల్సిన అధికారులు సైతం సరైన నిర్ణయం తీసుకోలేక దొంగలకే తాళాలు అప్పజెప్పాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ సెక్యులర్ విధానంలో మత స్వేచ్ఛను కల్పించిన విధానంలో కొన్ని నూతన విధివిధానాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.సెక్యులర్ విధానాన్ని అడ్డుపెట్టుకొని మతం మారినప్పటికీ ఉద్దేశపూర్వకంగానే అక్రమంగా ఎస్సీ రిజర్వేషన్ ను పొందుతూ



నిజమైన దళితులకు అన్యాయం చేస్తున్నారు.

ఇంకా చట్టాల్లో ఈ లొసుగులు ఇలాగే కొనసాగితే యావత్ దేశంలో నిజమైన దళితులు మరింత అనగదొక్కబడి కిందికి దిగజారిపోయే ప్రమాదం పొంచి ఉందని, ఈ దేశంలో ఎస్సీ కులాలు ఎస్సీ ఉపకులాల యొక్క చరిత్ర అద్భుతమైనది, అమోఘమైనది నాటి వ్యవస్థలో ఉన్న కొందరు దోపిడి దారుల వల్ల ఈ దేశంలో ఎస్సీ కులాలు అంటరానివిగా మారిన మాట వాస్తవం. కానీ హిందూ సనాతన ధర్మంలో ఎస్సీ కులాల ప్రజల ఆచార సంప్రదాయాలు చాలా గొప్పవి. తరతరాలుగా ఎన్నో కష్టాలు నష్టాలు అవమానాలు అపజయాలు ఎదురైనప్పటికీ ఈ దేశానికి ఈ ధర్మానికి వెన్నుముకగా నిలబడిన వ్యవస్థ ఎస్సీ సామాజిక వర్గం. ఎస్సీ కులాలు లేని హిందూ సనాతన ధర్మం మనకు కనపడదని,. ఎస్సీ కులాలు అంతరించిన నాడు ఈ దేశంలో సనాతన ధర్మం ఒంటి కాలుపై నిలబడక తప్పదన్నారు. ఇప్పటికే ఎస్సీలు అంటే క్రైస్తవులు క్రైస్తవులు అంటే ఎస్సీలు అనే విధంగా తయారైన సమాజంలో గత కొంతకాలం నుండి నేటి ఆధునిక ఎస్సీ యువ నాయకత్వం ముందుకు వస్తుండడం ముఖ్యంగా జాతీయవాద సిద్ధాంతంతో పనిచేస్తుండడంతో అసలైన ఎస్సీలు అంటే ఎవరు క్రైస్తవులు అంటే ఎవరనే ఒక తేడా స్పష్టంగా సామాన్య ప్రజలు తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి వెళ్లిన ఒక కేసుకు సంబంధించిన విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం చాలా స్పష్టంగా మతం మారిన ఎస్సీలకు ఎస్సీ హోదా మరియు అట్రాసిటీ హోదా వర్తించదని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు.మతం మారిన వారిని గుర్తించడంలో ఉన్న ఇబ్బందులపై రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు వారు ఈ దేశానికి ఒక విధి విధానం అందించాలని కోరుతున్నది ఈ ఎస్సి సంఘాల ఐక్య వేదిక. మతం మారిన వారు స్వయంగా ఒప్పుకుంటే తప్ప మతం మారినట్టు గుర్తించడం కష్టంగా మారిందన్నారు.నిజమైన దళితులను వారి హక్కులను ఆచార సంప్రదాయాలను రక్షించే క్రమంలో సెక్యులర్ మరియు మత స్వేచ్ఛ లాంటి చట్టాల్లో మార్పులు చేర్పులతో అందరికీ ఒకేలా కాకుండా ఎస్సీ రిజర్వేషన్ ను దృష్టిలో పెట్టుకుని నూతన విధానాలను రూపొందించాల్సిన అవసరం అత్యంత ఆవశ్యకమన్నారు.



## వేములవాడలో 12వ రోజుకు చేరిన

# వీఓఏల నిరవధిక సమ్మె

### వీఓఏల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపిన విమలక్క

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** తెలంగాణ ఐకేపీ, వీఓఏల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సెర్ప్ ఆధ్వర్యంలో వేములవాడ మండల పరిషత్ కార్యాలయం ముందు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిరసన దీక్షలో కూర్చున్న వీఓఏలకు అరుణోదయ సాంస్కృతిక సారథి వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మహిళా సంఘాల బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాత్రిం బవళ్లు శ్రమిస్తున్న వీఓఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 20,000 ఇవ్వాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలనే వారి డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని పేర్కొన్నారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతులు కల్పించాలని, సాధారణ మరియు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించడంతో పాటు 58 జీఓను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించేంత వరకు, వారి సమస్యలు తీరేంత వరకు తమ పోరాటం ఆపొద్దని, తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పెద్ద సంఖ్యలో వీఓఏలు పాల్గొని నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు ఈ నిరవధిక సమ్మెను ఇలాగే కొనసాగిస్తామని జేఏసీ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# నేతాజీ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

### 23 మంది విద్యార్థులకు నియామక పత్రాల అందజేత

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని నేతాజీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎస్ఆర్కే ఫంక్షన్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఎంఎన్సీ సంస్థ అయిన లాలాటాక్ష కంపెనీ ప్రతినిధులు పాల్గొని కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండో సంవత్సరం చదువుతున్న 23 మంది విద్యార్థులను యుఎస్ ఐటి బెంచ్ సేల్స్ రిక్రూటర్ పోస్టులకు ఎంపిక చేశారు.ఎంపికైన విద్యార్థులకు కంపెనీ ఆఫర్ లెటర్లను సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి, కళాశాల చైర్మన్ జూపెల్లి పృథ్వీధర్ రావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ నియామక




పత్రాలపై సంతకాలు చేశారు. ఎంపికైన వారికి వార్షిక వేతన ప్యాకేజీ రూ.1.50 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ, డిగ్రీ చదువుతూనే ఉద్యోగ అవకాశాలు పొందడం విద్యార్థులకు అరుదైన అవకాశం అని అన్నారు. సాధారణంగా అమెరికా, కెనడా వంటి దేశాల్లో మాత్రమే ఇలాంటి విధానాలు ఎక్కువగా కనిపిస్తాయని, అయితే సిరిసిల్లలోని నేతాజీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈ అవకాశం లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రాంత విద్యార్థిని విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు.. విద్యార్థులు ఉద్యోగంతో పాటు తమ డిగ్రీ విద్యను కూడా విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులకు జాయినింగ్ లెటర్లు, మెడల్స్ అందజేసి అభినందనలు తెలిపారు.. అనంతరం కళాశాల అధ్యాపక బృందాన్ని మేనేజ్మెంట్ ను విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాయిని జగన్మోహన్ రావు, కళాశాల ప్రిన్సిపల్ రేశం శ్రీకాంత్, అధ్యాపక బృందము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఉద్యోగస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలి

**జిల్లా తిరుమలేష్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు**



**మునుగోడు, అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు జిల్లా తిరుమలేష్ మాదిగ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగస్తులు తమ పిల్లలను పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించకుండా ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యానికి వారే మొదటి కారణంగా నిలబడ్డారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించకుండా బడిబాట కార్యక్రమం పేరిట ఇంటింటికి తిరిగి పిల్లల్ని చేర్పించమని కోరడం విడ్డూరమన్నారు. ప్రభుత్వానికి నిజంగా ప్రభుత్వ పాఠశాల బలోపేతం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే ప్రభుత్వ ఉద్యోగస్తులు అందరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికే ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# నిఘా నీడలో ముస్తాబాద్ మండలం

**101 సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతకు మరింత భరోసా.**

**నేరాల నియంత్రణలో,కేసుల చేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.**

**ఒక సీసీ కెమెరాల 100 మంది పోలీసులతో సమానం.**

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**రాజన్న సిరిసిల్ల, అక్షిత బ్యూరో:** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం లోని శనివారం రోజున ముస్తాబద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 101 సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమనికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా పాల్గొని సీసీ కెమెరాలు ప్రారంభించారు.

ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...

నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, శాంతిభద్రతల



పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఒక్క సీసీ కెమెరా100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన నిందితులను త్వరితగతిన గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసు శాఖ ముందంజలో సాగుతోందని తెలిపారు.సీసీ కెమెరాలు, డిజిటల్ నిఘా వ్యవస్థలు,ఆధునిక దర్యాప్తు పద్ధతుల ద్వారా నేరాల నియంత్రణ మరింత సమర్ధవంతంగా జరుగుతోందన్నారు. ప్రజలు, వ్యాపారస్థులు, ప్రజాప్రతి నిధులు స్వచ్ఛందగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని, తద్వారా పట్టణాల్లో, గ్రామాల్లో సంచరించే అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం,నేరాలకు పాల్పడిన వ్యక్తులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమాజంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయన్నారు.

ముస్తాబద్ మండలంతో పాటుగా గ్రామాల్లో స్వచ్ఛందగా ముందుకు వచ్చి 101 సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చిన ధాతలను జిల్లా ఎస్పీ గారు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ నాగేశ్వరరావు, ఎస్.ఐ గణేష్, ప్రజాప్రతినిధులు, సన్ రైస్ సీసీ కెమెరాల కంపెనీ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు పూర్తి చేయండి

**విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత**

**గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యం**

**పాఠశాలల పునఃప్రారంభం నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** పాఠశాలల పునఃప్రారంభం నాటికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల నిర్మాణ పనులను పూర్తిచేసి విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలంలోని పోల్కంపల్లి, వంగూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ భవనాల పనులను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాల భవన నిర్మాణం, తరగతి గదులు, లైబ్రరీ, ఆటస్థలాలు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటును పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల పురోగతిని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్న ఆయన, పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మిస్తున్న ఈ విద్యాసంస్థల్లో ప్రతి నిర్మాణం నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ సామగ్రి నాణ్యత, భవనాల భద్రతా ప్రమాణాలు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా తరగతి గదుల రూపకల్పన వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అన్ని వసతులు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తున్నట్లు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా అత్యాధునిక విద్యా వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందన్నారు.

పాఠశాలల పునఃప్రారంభ సమయానికి నిర్మాణ పనులు పూర్తికాకపోతే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్న కలెక్టర్, మిగిలిన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ప్రారంభం నాటికి అన్ని తరగతి గదులు, లైబ్రరీ, ఆటస్థలాలు, తాగు నీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు పూర్తిస్థాయిలో అందు బాటులో ఉండేలా చూడాలని సూచించారు.

నిర్మాణ పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన చోట తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం నిర్మాణ ప్రదేశంలో పనిచేస్తున్న అధికారులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలలను విద్యార్థుల వినియోగానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రమేష్ కుమార్, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం...

**- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా పోలీస్ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధి నిర్వహణ చేపట్టాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, డిజిటల్ రికార్డుల నిర్వహణ మరియు క్షేత్రస్థాయి భద్రతా చర్యలపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్




కమిషనర్ జారీ చేసిన ముఖ్యమైన ఆదేశాలు జారీ చేశారు. నేపాలి మరియు ఇతర రాష్ట్రాల కార్మికుల గుర్తింపు వివరాల నమోదు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. కరీంనగర్ పరిధిలో దాదాపు 1000 మంది వరకు నేపాలీలు వివిధ రంగాలలో పనిచేస్తున్నారని, ప్రస్తుతం వారిలో కేవలం 169 మంది వివరాలు మాత్రమే నమోదయ్యాయని సిపి తెలిపారు. ఇతర రాష్ట్రాలు మరియు దేశాల నుండి ఇక్కడికి వచ్చి కూలీలుగా, కార్మికులుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను, వారి అధికారిక గుర్తింపు కార్డులతో సహా సంబంధిత పోలీస్ స్టేషన్లలో రికార్డు చేయాలని ఆదేశించారు. యజమానులు సైతం తమ వద్ద పనిచేసే వలస కార్మికుల వివరాలను పోలీసులకు అందించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు డేటా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.భవిష్యత్తులో కేసుల పరిశోధన, ట్రాకింగ్ మరియు రికార్డుల పరిశీలన అంతా పూర్తిగా సీసీటీఎన్ఎస్ ( క్రైమ్ మరియు క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టమ్ ) పైనే ఆధారపడి ఉంటుందని సిపి స్పష్టం చేశారు. అందువల్ల, పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే ప్రతి కేసు యొక్క పూర్తి వివరాలను నిర్ణీత గడువులోగా ఎలాంటి ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ఎప్పటికప్పుడు కఠిన నిఘా ఉంచాలన్నారు.సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం



కలిగించే అసాంఘిక శక్తులు, రౌడీ షీటర్లు మరియు హిస్టరీ షీటర్ల కదలికలపై స్థానిక పోలీసులు 24 గంటలూ నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. పాత నేరస్థుల ప్రవర్తనను నిశితంగా గమనిస్తూ, నగరంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మాల్ఖానాల సమర్ధవంతమైన నిర్వహణ చేపట్టాలని, పోలీస్ స్టేషన్లలోని మాల్ఖానా కేసులకు సంబంధించిన స్వాధీనపరుచుకున్న సొత్తు/వస్తువుల గది నిర్వహణ అత్యంత పారదర్శకంగా, క్రమపద్ధతిలో ఉండాలని సిపి స్పష్టం చేశారు. మాల్ఖానాలోని ప్రతి వస్తువు రికార్డులలో స్పష్టంగా నమోదు కావాలని, వాటి భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో కమిషనరేట్ పరిధిలోని ఏసీపీ సిసిఆర్బీ శ్రీనివాస్ జి, ఇన్స్పెక్టర్ సరిలాల్, కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎక్సైజ్ నేరాలలో స్వాధీనం చేయబడిన

# వాహనాల వేలం ద్వారా రూ.4,22.016/-

### నాగర్ కర్నూలు జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి దేవి

### కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** ప్రోహిబిషన్ మరియు కల్వకుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం నాడు జరిపిన వాహనాల వేలం నందు 18 వాహనాలు వేలం వేయగా 14 వాహనాలకు ఆసక్తి వ్యక్తులు కోనుగోలు చేసినారు ప్రభుత్వం నిర్ణయించిన ధర 2,95,000 /- గాను జీఎస్టీతో కలిపి మొత్తం,రూ, 4,22,016/- కలిపి ఆదాయం సమకూరింది ఈ కార్యక్రమం నాగర్ కర్నూల్ జిల్లా ఎక్సైజ్ అధికారిశ్రీమతి.డి,గాయత్రి దేవి సమక్షంలో నిర్ణయించడం జరిగింది



ఇట్టి కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జే వెంకటరెడ్డి సిబ్బంది జంగయ్య మునీందర్ చంద్రశేఖర్ జనార్దన్ రెడ్డి సిద్ధార్థ అనిల్ తేజశ్రీ సునీత పాల్గొన్నారు.

# డంపు యార్డును తనిఖీ చేసిన కమీషనర్ ప్రఫుల్ దేశాయ్

**కరీంనగర్ అక్షిత బ్యూరో:**

నగరపాలక సంస్థ పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా శనివారం కమీషనర్ ప్రఫుల్ నగరంలోని బైపాస్ రోడ్డులో గల డంపు యార్డును ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులతో కలిసి సందర్శించారు. వ్యర్థాల నిర్వహణ పనుల్లో భాగంగా డంపు యార్డులో పేరుకుపోయిన పాత వ్యర్థాలను తొలగింపులో యంత్రాల సహాయంతో కొనసాగుతున్న బయోమైనింగ్ ప్రక్రియను స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ ఏ దశలో ఉంది ఎంత మేర వ్యర్థాలను బయోమైనింగ్ ద్వారా నిర్మూలించారనే వివరాలను ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగాల అధికారులను అడిగి తెలుసు కున్నారు. బయోమైనింగ్ పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ ప్రతినిధులను, అధికారులను ఆదేశించారు. అనంతరం డంపు యార్డులో వ్యర్థాల వల్ల అంతర్గతంగా వాయువుల కారణంగా పలు చోట్ల మంటలను పొగను కమీషనర్ పరిశీలించారు. పరిసర ప్రాంతాల ప్రజలకు, కాలనీ వాసులకు ఎలాంటి అబ్బందులు కలగకుండా తక్షణమే పొగను అదుపు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డంపు యార్డులో నిరంతరం పర్యవేక్షిస్తూ ఫైర్ సేఫ్టీ చర్యలు పాటించాలని ఆదేశించారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నగరపాలక సంస్థ పనిచేస్తోందని, వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా తగిన



చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డంపు యార్డు ద్వారా స్థానిక ప్రజలు ఇబ్బందులు కలగకుండా బయోమైనింగ్ ప్రక్రియ వేగవంతం చేశామని తెలిపారు. డంపు యార్డును పూర్తిగా ప్రక్షాలన చేసి ప్రజల ఇబ్బందులు త్వరలోనే తొలగిస్తామని తెలిపారు.

# 3న అన్ని జిఎం కార్యాలయాల ముందు ధర్నా

### జూన్ 2న డిపెండెంట్ ఉద్యోగం పొందిన కార్మికులకు నియామక పత్రాలు అందజేయాలి

### కార్మిక సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 2వ వారం సమ్మెకు పిలుపు

### కారుణ్య నియామకాలలో పాత విధానాన్ని కొనసాగించాలి

### 56 వేల కోట్ల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

### ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

**అక్షిత ప్రతినిధి/ భూపాలపల్లి:** జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ రోజున మెడికల్ ఆన్ ఫిట్ పొందిన 400 మంది కార్మికుల పిల్లలకు ఉద్యోగ పత్రాలు అందజేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ డిమాండ్ చేశారు.శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కొమురయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఈ నెల 25న కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలతో డిప్యూటీ సీఎం తో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు రకాల డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచడం జరిగిందని, అందులో ముఖ్యంగా జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో గతంలో డిపెండెంట్ ద్వార ఉద్యోగం పొందిన పిల్లలకు నియామక పత్రాలు అందజేయాలని కోరడం జరిగిందన్నారు. లేదంటే జూన్ 3న అన్ని జిఎం కార్యాలయాల ముందు డిపెండెంట్ కార్మికులతో ధర్నా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

అప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే జూన్ రెండవ వారంలో సమ్మెకు పిలుపునివ్వడం జరుగుతుందని తెలిపారు.అట్లాగే కారుణ్య నియామకాలను పాత విధానంలో కొనసాగించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు.కార్మికుల సొంతింటి పథకం అమలు,మారుపేరు సమస్యను ఉపముఖ్యమంత్రి కి వివరించడం జరిగిందని,1982-83 లో కొంతమంది ఉద్యోగులు ఎంప్లాయ్మెంట్




కార్డు మీద మారుపేరులతో ఉద్యోగం పొందడం జరిగిందని ప్రస్తుతం వారి యొక్క మారుపేరు సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. సింగరేణి కి ప్రభుత్వం చెల్లించవలసిన 56 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో గోల్డెన్ స్కీమ్ ద్వారా రిటర్మెంట్ పొందిన కార్మికులకు వెయ్యి రూపాయల మాత్రమే పింఛన్ వస్తుందని వారికి ప్రభుత్వం ఆసరా పింఛన్, ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని యాజమాన్యాన్ని కోరడం జరిగిందన్నారు. అనేక సార్లు గుర్తింపు సంఘంగా కార్మిక సమస్యలపై ప్రభుత్వం, యాజమాన్యానికి వివరించిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు..ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని లేదంటే దశల వారి ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రాజ్ కుమార్ హెచ్చరించారు. జూన్ 3న జరిగే జిఎం కార్యాలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి డిపెండెంట్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గురుజేపెల్లి సుధాకర్ రెడ్డి, ఆసిఫ్ పాషా, తోట రామ్ చందర్, రవి ,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఒక సిలిండర్‌పై 60 రూపాయలు

# వసూలు చేస్తున్న గ్యాస్ ఏజెన్సీలు

### ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

**ఉమ్మడి నల్గొండ అక్షిత బ్యూరో:** ప్రముఖ కంపెనీలైన శ్రీ బాలాజీ ఏజెన్సీ చిట్యాల అదేవిధంగా రామన్నపేట మండల ప్రజలకు అందుబాటులో ఉన్నటువంటి ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ శ్రీ అభయాంజనేయ గ్యాస్ ఏజెన్సీ వారు ప్రజల నుండి అక్రమంగా 60 రూపాయలను వసూలు చేస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తూ వారి సొంత జేబులోకి వేసుకుంటున్నారు ఎందుకు అదనంగా తీసుకుంటున్నారని డెలివరీ చేయడానికి వచ్చినటువంటి ఆ డెలివరీ పోయిన అడిగితే వారు చెప్పే సమాధానం ఆటో చార్జి 30 రూపాయలు ఏజెన్సీ డెలివరీ బాయ్ 30 రూపాయలు తీసుకుంటాం కచ్చితంగా ఇది మా హక్కు అని చెప్పేసి మాట్లాడుతున్నారు అయితే కంపెనీ సంబంధించినటువంటి ఏదైతే ఉందో లా దాంట్లో 969 రూపాయలు మాత్రమే చెల్లించాలని వారు చెప్తున్నారు. వీరు అదనంగా 60 రూపాయలు తీసుకుంటున్నారు సామాన్య ప్రజలు ఇవాళ పెరుగుతున్నటువంటి గ్యాస్ ధరలను చూస్తే కొనేటువంటి పరిస్థితుల్లో లేరు దానికి అదనంగా కంపెనీ వారు 60 రూపాయలు వసూలు చేయడం అనేది ఎంతవరకు సమంజసం సాధారణ ప్రజలు నేడు గ్యాస్ కొనాలంటేనే భయపడుతున్న పరిస్థితుల్లో ఏజెన్సీ వాళ్ళు ఇలా చేయడం ఎంతవరకు కరెక్ట్ సొంత లాభం చూసుకుంటూ సాధారణ ప్రజలకు అసౌకర్యాలు కల్పిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు ఇప్పటికైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నటువంటి ఏజెన్సీ ల పైన తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు

# అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

### పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సిరిసిల్ల పట్టణంలో గత కొన్ని రోజుల నుండి అనేక అక్రమ నిర్మాణాలపై రోడ్డు నాలాల కబ్జాలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ఉన్నారు ఈ నిర్లక్ష్యాన్ని నిర సిస్తూ మున్సిపల్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో మున్సిపల్ కార్యాలయం ముందు మున్సిపల్ అధికారుల తీరుకు ఏఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణంలో బడా బాబులు ఎన్ని అక్రమాలు చేస్తున్న వాటిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు బడా నాయకుల కనుసన్నలలో మెదులుతూ ఫిర్యాదులను పెడచెవిన పెడుతూ ఉన్నారు సంజీవయ్య నగర్ లోని ఇంటి నెంబర్ 2-5-12 0




గలదానిలో జి ప్లస్ టు రెసిడెన్షియల్ పర్మిషన్ తీసుకుని జి ప్లస్ ఫోర్ బిల్డింగ్ నిర్మాణం చేసి కమర్షియల్ హాస్పిటల్ నడుపుతున్నారని అట్టి బిల్డింగ్ కు ఎలాంటి సెట్ బ్యాకు లు లేకుండా పార్కింగ్ స్థలం లేకుండా ఫైర్ ఎన్ఓసీలు లు లేకుండా ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా హాస్పిటల్ నిర్వహిస్తున్నారని కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతుంది అని ఎన్ని మార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు ఇలాంటివి సిరిసిల్లలో అనేకము ఉన్న వాటిపై ఫిర్యాదు చేసిన బడా రాజకీయ నాయకుల అండతో అక్రమ నిర్మాణాలు అక్రమ వ్యాపారాలు యదేచ్చగా నాలా కబ్జాలు రోడ్డు కబ్జాలు కొనసాగిస్తూ ఉన్నారని ఆరోపించినారు ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని లేనియెడల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలేంద్రి ఎల్లయ్య గుజ్జ దేవదాస్ ప్రసాద్ లచ్చన్న ఆకెన సత్తయ్యలు పాల్గొన్నారు.

## వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ డైరెక్టర్‌గా గెలుపొందిన పొక్కుల సరోజన గంగపుత్ర

### అభినందించిన టి.జి.ఎస్ రాజేష్ ఖన్నా గంగపుత్ర



**కాశీబుగ్గ, అక్షిత న్యూస్:** వరంగల్ గంగపుత్ర హౌసింగ్ సొసైటీ కార్యాలయంలో జరిగిన పాలక మండలి ప్రత్యేక సమావేశంలో ఖాళీగా ఉన్న డైరెక్టర్ ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో డైరెక్టర్‌గా పొక్కుల సరోజన గంగ పుత్ర ఉపాధ్యక్షుడిగా ఎలుగు వెంకటేశ్వర్లు గంగపుత్ర గెలుపొందిన సందర్భంగా వారికి తెలంగాణ గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి టుంగుటూరి రాజేష్ ఖన్నా గంగపుత్ర ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ వారి ఇరువురి విజయంలో కీలక భూమిక పోషించిన సొసైటీ డైరెక్టర్ బయ్యా అనిల్ గంగపుత్రకు అధ్యక్ష కార్యదర్శులు డోలి రాజలింగం గంగపుత్ర పారిపెల్లి రాజేంద్ర కుమార్ గంగపుత్రలకు మరియు పాలక మండలి సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వరంగల్ గంగపుత్ర సొసైటీ అభివృద్ధికి పాలక మండలి సభ్యులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు.

## అన్నారావుకు పదవి విరమణ వీడ్కోలు

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సీనియర్ అసిస్టెంట్ అన్నారావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఆయన సేవలను కొనియాడారు. కాగజ్‌నగర్ ప్రాంతానికి చెందిన అన్నారావు



2003లో స్వీపర్‌గా పోలీసు శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి, క్రమంగా పదోన్నతులు పొందుతూ సీనియర్ అసిస్టెంట్ హోదాకు చేరు కున్నారు. సుదీర్ఘకాలం శాఖకు విశిష్ట సేవలు అందించిన ఆయన పదవీ విరమణ సందర్భంగా సహోద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ అన్నారావు తన విధుల్లో అంకితభావంతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ఆయన చూపిన క్రమశిక్షణ, నిబద్ధత ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, ఏవో భక్త ప్రహ్లాద్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జీనియస్ వరల్డ్ రికార్డ్‌లో చోటు సంపాదించిన రిచ్విన్

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి పట్టణానికి చెందిన బాలుడు రిచ్విన్ అరుదైన ప్రతిభను చాటుతూ జీనియస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. కటికే రిచ్విన్ సంగీత రంగంలో ప్రతిభను చాటుతూ ప్రత్యేక గుర్తింపు పొందాడు,కటికే దేవపుత్ర (పాస్టర్) కుమారుడు




హైదరాబాదులో నిర్వహించిన భారీ సంగీత ప్రదర్శన వివిధ దేశాల కు సంగీత కళాకారులు 2000 మంది, భాగస్వామ్యం కావడం జరగగా రిచ్విన్ సంగీత కార్యక్రమంలో ప్రతిభ చాటగా ఇంటర్నేషనల్ మ్యూజిక్ స్కూల్ అధినేత అగస్టీవ్ దండంగి చేతుల మీదుగా వరల్డ్ రికార్డు ప్రతిభ పత్రాలు అందుకున్నారు. శుక్రవారం గచ్చిబౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ చిన్న వయసులోనే అద్భుతమైనటువంటి ప్రతిభతో సాగుతున్న బాలుడికి ఉపాధ్యాయులు గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తూ రాబోయే కాలంలో గొప్ప స్థాయిలో ఉండాలని ఆశీర్వదించారు.





## సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీలు

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:** జూన్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లాలో చేపడుతున్న ఏర్పాట్లను శనివారం జిల్లా ఎస్పీ నితికా పంత్, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సంయుక్తంగా పరిశీలించారు.


కెరమెరి మండలం కొరారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో పర్యటన స్థలాన్ని సందర్శించిన ఎస్పీలు, ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను పరిశీలించి భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

పర్యటన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సేవల అందుబాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించనున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు.

సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు ఏర్పాటు చేస్తున్న ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను డ్రోన్ సాయంతో పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటన, సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీలు సూచించారు. ఈ పరిశీలనలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్లు పెంచి ఇవ్వాలి

### సిపిఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** సిరిసిల్ల పట్టణంలోని అమృతలాల్ శుక్లా కార్మిక భవన్ లో మీడియాతో సిపిఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చేయుత పింఛన్లు పెంచి జూన్ 2 నుండి ఇవ్వాలని రెండు లక్షల కొత్త పింఛన్లు కూడా అర్హులైన కొత్తవారికి ఇవ్వాలని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన వికలాంగులకు 4016 రూపాయలు వృద్ధులు వితంతువులు వికలాంగులకు ఒంటరి మహిళలకు తదితర వారికి ఇస్తున్న 2016 రూపాయలు కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల 6000 వృద్ధులు ఇతరులకు 4000 ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని జూన్ 2 నుండి హామీ ఇచ్చిన మేరకు పెన్షన్లు పెంచి ఇవ్వాలని కొత్త పెన్షన్లు మంజూరయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గత ప్రభుత్వ కాలంలో సదరం సర్టిఫికెట్లలో అంగవైకల్యం లేకున్నా అంగవైకల్యం ఉన్నట్టు పర్సంటేజీ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని వాటిని కూడా రీ వెరిఫికేషన్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.






## 27వ వార్డు కౌన్సిలర్ మృతికి సంతాపం తెలిపిన మున్సిపల్ పాలకవర్గం

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:**

మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించదలచిన మున్సిపల్ సాధారణ సమావేశాన్ని 27 వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ ఆకస్మిక మరణం కారణంగా వాయిదా వేస్తూ కాసర్ల పద్మ మరణం పట్ల సంతాపాన్ని తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ శుక్రవారం 27వ వార్డు కౌన్సిలర్ కాసర్ల పద్మ హార్ట్ ఎటాక్ వల్ల స్వర్గస్తులయ్యారని తెలుపుటకు చింతిస్తూ వారు లేని లోటు ఎవరు తీర్చలేనిదని అన్నారు. కాసర్ల పద్మ తండ్రి కాసర్ల రామయ్య కూడ ప్రజా సేవలో ఉంటూ ప్రజల సమస్యల పై పోరాటం చేస్తూ అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ప్రజా ప్రతినిధిగా కౌన్సిలర్‌గా సిరిసిల్ల అభివృద్ధికి కృషి చేశారు అని అన్నారు. కాసర్ల పద్మ వారి తండ్రి స్ఫూర్తితో ప్రజాసేవ ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చి 2000 సంవత్సరంలో కౌన్సిలర్‌గా గెలిచి ప్రజలకు విశేష సేవలు అందించారని మళ్లీ 2026 లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా గెలిచి కనీసం నాలుగు మాసాలు కూడా నిండకుండానే స్వర్గస్తులవడం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. వారితో చైర్పర్సన్‌గా చాలా తక్కువ కాలం పరిచయం ఉన్న ఈ తక్కువ కాలంలోనే వారు ప్రజా సమస్యల పైన మున్సిపల్ సేవల పైన ఎంతో అవగాహనతో చాలా అనుభవంతో నాతో చర్చించేవారని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరితో ఒక కుటుంబ సభ్యురాలుగా వరుసలు కలుపుతూ ఆప్యాయంగా పలకరిస్తూ ఉండేవారని అన్నారు. కాసర్ల పద్మ లేని లోటు కచ్చితంగా తెలుస్తుందని భావోద్వేగంతో మాట్లాడారు. కాసర్ల పద్మ భౌతికంగా మానతో లేకపోయినా వారి ఆశయాలకు అనుగుణంగా 27వ వార్డును అన్ని వార్డులతో సమానంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతూ 27వ వార్డుకు మెరుగైన సేవలు అందించేలా మా పాలకవర్గం అందరం కృషి చేస్తామని ఈ సందర్భంగా అన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదిర్ ఫాషా , వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు, కాసర్ల పద్మ ఆకస్మిక మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి సందేశాన్ని అందించారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY







# తల్లి,శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

### పోషకాహార లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలిరి

### "అమ్మ మాట - అంగన్వాడి బాట"

### కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** తల్లి, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన "అమ్మ మాట – అంగన్వాడి బాట" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పరిరక్షణ చర్యలు, నమోదు వివరాలు తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "అమ్మ మాట – అంగన్వాడి బాట" కార్యక్రమం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. చిన్నారుల ఎదుగుదల, బరువు, ఎత్తు వంటి వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పోషకాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

గర్భిణీలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలింతలు, గర్భిణీలు పోషకాహారంపై అవగాహన పెంపొందించుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సందర్శన సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులు, హాజరు పట్టికలు, గుడ్లు, పోషకాహార నిల్వలు, పంపిణీ విధానాలను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రానికి వచ్చిన గర్భిణీలు, బాలింతలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో తల్లి, శిశు ఆరోగ్యంపై మరింత అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

### ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి తనిఖీ

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శనివారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐ ఎం యూ, ఐసీయూ, ఎస్ఎన్ సీయూ, మెటర్నిటీ వార్డుల్లో పరిశీలించి.. రోగులతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు. రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది నిత్యం సమయానుసారంగా అందుబాటులో ఉండాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు.

### వైద్య సేవలు ఎలా ఉన్నాయి?

ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా అందుతున్నాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆరా తీశారు. చిన్నారితో ఉన్న మహిళతో మాట్లాడారు. ఆసుపత్రికి ఎప్పుడు వచ్చారు? పాప ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలు అడిగి తెలుసుకున్నారు.

### ఉన్నత విద్యను అభ్యసించాలి

ఐఎంయూ వార్డులో చికిత్స పొందుతున్న బాలుడు, బాలికతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఏ అనారోగ్య సమస్యతో వచ్చారో.. ఆరా తీసి.. ఎక్కడి వరకు చదువుకున్నారు

అడిగి తెలుసుకున్నారు. తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఐటీఐలో స్వయం ఉపాధి కోర్సులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారు పూర్తి వివరాలతో వెళ్లి కలవాలని తెలిపారు. కోర్సుల్లో ఉచిత విద్య ఉంటుందని, మంచి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిశీలనలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్యులు సంతోష్, సుమన్ మోహన్ రావు, తహసీల్దార్ మహేష్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.





## తర్నికల్ గ్రామాన్ని సందర్శించి ఆకస్మిక తనిఖీ నిర్వహించిన కల్వకుర్తి ఎంపీడీవో గాలే యాదయ్య

**కల్వకుర్తి, అక్షిత:** కల్వకుర్తి మండలములోని తర్ణికల్ గ్రామములో జరుగుతున్న ఉపాధి హామీ ఫీడర్ ఛానల్ పనులను సర్పంచ్ శ్రీమతి వరలక్ష్మి పవనకుమార్ రెడ్డితో కల్వకుర్తి ఎంపీడీవో గాలే యాదయ్య పరిశీలించనైనది. ఈ సందర్బంగా కూలీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ,జాబ్ కార్డు లో నమోదైన అందరు పనులకు రావాలని, ఉదయం తొందరగా వచ్చి 04 గంటలు పని చేసి 02 అటెండెన్స్ లు ఎన్ఎంఎంఎస్ ద్వారా అప్లోడ్ చేసుకొనుటకు సంహరించాలని కొరారు అదేవిదంగా పనులు నాన్యతగా చేయాలి అని, భూగర్భ జలాలు పెంచే పనులను చేసుకొని,



వ్యవసాయం చేసుకొనుటకు వీలు కలుగుతుందని తెలుపడం జరిగింది. మరి ముక్యంగా ఉపాధి హామీ పనులు ఇంటిలో ఉన్న అందరు పని చేసి, అట్టి డబ్బులను వ్యవసాయమునకు వినియోగించుకోవాలని కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్స్, అరటి పండ్లు పంపిణి చేయనైనది..ముక్యంగా గ్రామములో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి, లబ్దిదారులు వెంటనే పూర్తి చేయుటకు సూచించానైనది.గ్రామములో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించానైనది గ్రామపంచాయతీ రికార్డు లను పరిశీలించడం జరిగింది కూలీలకు షానీటేషన్ ప్రాముఖ్యత, రాబోవు వర్షా కాలములో తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించానైనది. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎంపీడీవో గాలే యాదయ్య సర్పంచ్ వరలక్ష్మి పవన్ కుమార్ రెడ్డి కార్యదర్శి బాలరాజు పంచాయతీ సిబ్బంది ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు..

## కోనరావుపేటలో ఎస్ఐఆర్ బిఎల్ఎ-2 అవగాహన కార్యక్రమం నిర్వహణ

**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** భారతీయ జనతా పార్టీ కోనరావుపేట మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మిర్యాల్కర్ బాలాజీ నేతృత్వంలో ఎస్ఐఆర్ బిఎల్ఎ –2 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర నాయకుడు లింగంపల్లి శంకర్ కార్యకర్తలకు, బిఎల్ఎ –2 ప్రతినిధులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఓటరు జాబితా పరిశీలనలో బిఎల్ఎ –2 ల పాత్ర ఎంతో





కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకే వ్యక్తి పేరుతో రెండు ఓట్లు ఉన్నా, వివిధ ప్రాంతాల్లో నివసిస్తూ రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్నా సంబంధిత బిఎల్ఓ, బిఎల్ఎ లకు సమాచారం అందించాలని సూచించారు. మరణించిన వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలో కొనసాగు తున్నట్లయితే వాటిని తొలగించడం, కొత్తగా అర్హత పొందిన వారిని ఓటరు జాబితాలో చేర్చడం వంటి ప్రక్రియలే ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. భారత ఎన్నికల సంఘం తరఫున పనిచేస్తున్న బి ఎల్ ఓ లకు సహకరిస్తూ, ఓటర్ల సందేహాలను నివృత్తి చేసే విధంగా బిఎల్ఎ –2లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు గొట్టే రామ చంద్రం, అజ్మీర్ తండా సర్పంచ్ జయరాం, మండల ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి జలందర్, మండల ఉపాధ్యక్షుడు చింతల పరశురాములు, సోషల్ మీడియా మండల కన్వీనర్ లంబ వేణు, సీనియర్ నాయకులు జింక వెంకటి, మోత్క మోహన్, అబ్బసాని రాములు, పొన్నం మహేష్, కడల్ల వికాస్, బ్రహ్మాచారి, పిల్లి వెంకటేష్, సుధాగోని సాయికృష్ణ, బోయిని నరసయ్య, దుర్ల శంకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.